ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 17, నవంబర్ 2026



సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

* జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
* అత్యాశకు పోతే సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం
* మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలి
* ఉట్నూర్ ఐటీఐ కళాశాలలో 300 మంది విద్యార్థులతో అవగాహన సదస్సు, పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్, నవంబర్ 16, ప్రభాతవార్త:

విద్యార్థులు అన్ని రకాల సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల ఐటీఐ కళాశాలలో 300 మంది విద్యార్థులతో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, గుర్తుతెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌లు, నకిలీ లింకులు, అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యాశకు గురై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు **మిగతా 2లో..**



ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త :

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణం నౌగాం బస్తీకి చెందిన మోతే పోచమ్మ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణం నూర్ నగర్ కు చెందిన పాటిల్ జగన్నాథ్ తన ఆస్తిని తన పిల్లలు మొత్తం తీసుకొని, తన పోషణ పట్టించుకోవడం లేదని, తన ఆస్తిని తనకు అప్పగించాలని, వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన వేములవాడ హారిక తనకు ఆశా వర్కర్ గా ఉపాధి కల్పించాలని, సిర్పూర్ యు మండలం పాములవాడ గ్రామానికి చెందిన ఆత్రం అర్జుబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, కాగజ్ నగర్ పట్టణం బాలాజీ నగర్ కు చెందిన గజ్జల పెళ్లి స్వప్న తనకు రెండు పడక గదుల ఇల్లు కేటాయించాలని, కెరమెరి మండలం చౌపన్ గూడ గ్రామానికి చెందిన గిరిజనులు తమ వ్యవసాయ భూములకు బావులు, బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామానికి చెందిన మేకార్తి గోపాల్ తనకు తన తండ్రి నుండి వచ్చిన భూమిని సమానంగా పంచి ఇవ్వలేదని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని, పిల్లల ప్రజావాణిలో ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామానికి చెందిన విద్యార్థులు తమ గ్రామంలో గల తెలంగాణ సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం, త్రాగునీరు, వంటశాల, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, చింతల మానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన దుర్గం అచ్యుతపల్లి అనే 6వ తరగతి విద్యార్థిని తనకు కరీంనగర్ జిల్లా చింతకుంటలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో సీటు వచ్చిందని, తనకు దూరము అవుతున్నందున జిల్లాలో ఏదైనా గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లల ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి

* అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
* ఈ నెల 19న జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకేరోజు ప్రత్యేక శిబిరాల ఏర్పాటు



నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త:

జిల్లావ్యాప్తంగా ఈ నెల 19న నిర్వహించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరాలను అత్యంత పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శిబిరాల ఏర్పాట్లు, నమోదు ప్రక్రియపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ నెల 19న ఒకేరోజు నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పథకానికి సంబంధించిన పూర్తి అవగాహన క్షేత్రస్థాయి అధికారులకు ఉండాలని, దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల వివరాలు, నామినీ, వయస్సు, బంధుత్వ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. నమోదు ప్రక్రియతో పాటు డిజిటలైజేషన్‌లోనూ **మిగతా 2లో..**



ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌ను తొలగించాలని ఆందోళన

ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త :

ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌ను తొలగించి గతంలో విధులు నిర్వహించిన ప్రిన్సిపాల్‌నే తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వైద్య విద్యార్థులు రోడ్డెక్కారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. తలకు పాలిథిన్ కవర్లు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఇంచార్జ్ ప్రిన్సిపాల్ నియామకంపై అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు గతంలో పనిచేసిన ప్రిన్సిపాల్‌ను తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను అధికారులు పట్టించుకోవాలని, విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తూ తమ ఆందోళనను కొనసాగించారు. తమ డిమాండ్ పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొనడంతో కలెక్టరేట్ పరిసరాల్లో కొద్దిసేపు సందడి నెలకొంది.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

సంపాదించవచ్చని, అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆఫర్లను నమ్మి సైబర్ మోసాలకు గురికావద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల నుంచి, కొన్ని సందర్భాల్లో విదేశాల నుంచి కూడా నేరాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అప్రమత్తతతో పాటు అవగాహన కలిగి ఉండటం ద్వారా సైబర్ మోసాలను అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కేవైసీ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఫేక్ బాబా పేరుతో ఆధ్యాత్మిక మోసాలు, సోషల్ మీడియా ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, మ్యూట్‌మోనీ ఫ్రాడ్, నకిలీ లింకులు, మెసేజ్‌ల ద్వారా జరిగే మోసాలు, ఓటీపీ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, మ్యూల్ అకౌంట్స్ వంటి సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.అదేవిధంగా విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ప్రమాదాల నివారణకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై స్పష్టమైన నిర్దేశాలతో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, సీఐ ఎం. ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్, డీ4సీ ఏఎస్ఐ సురేందర్, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి బతుకు మారితేనే నిజమైన పాలనకు అర్థం

● బీఎస్పీ జిల్లా కార్యదర్శి చెరుకు రాజ్యం ● ప్రభుత్వ పాఠశాలలు, రైతులు, ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్

● ఎన్హెచ్ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి



నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రైతుల సమస్యలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారుల పరిస్థితిపై ప్రభుత్వాలు మరింత గట్టిగా దృష్టి సారించాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి చెరుకు రాజ్యం అభిప్రాయపడ్డారు. సమాజంలో ప్రతి పేదవాడి బతుకు మారితేనే నిజమైన పాలనకు అర్థం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు, విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాముల పిల్లలు అత్యుత్తమ విద్యా సౌకర్యాలు ఉన్న సంస్థల్లో చదువుతున్న నేపథ్యంలో కనీస వసతులు కూడా సరిగ్గా లేని ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన స్థాయికి అభివృద్ధి చేయాలని, పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో మాట్లాడటంలో వెనుకబడుతున్నారని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో అసమానతలు తొలగిపోయి సమన్వయం ఏర్పడితేనే అట్టడుగు వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. పురుగుల మందులు, గడ్డి మందులు, విత్తనాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, అదే సమయంలో రైతు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని వెంటనే పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో మాయిశ్చర్ విషయంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల ఉపాధి, ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతోందని, వారి జీవనోపాధిని కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని చెరుకు రాజ్యం అన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా కుటుంబ బాధ్యతలు ఉంటాయని గుర్తు చేశారు. అలాగే కార్పొరేట్ మాల్స్ వల్ల చిరు వ్యాపారులు నష్టపోకుండా తగిన రక్షణ కల్పించాలని, అందరి బతుకులను ఆదుకునే విధంగా ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాల ప్రచారంతో పాటు పేద ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎన్హెచ్ఎం ఆరోగ్య ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. వారికి పక్కాగా ఉద్యోగ భద్రత కల్పిస్తేనే ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని అభిప్రాయపడ్డారు. కుల, మతాలకు అతీతంగా సామాజిక పరివర్తన, ఆర్థిక విముక్తి సాధించే దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని చెరుకు రాజ్యం పిలుపునిచ్చారు.

మహిళలు, బాలికల భద్రతపై అవగాహన

హక్కులపై అవగాహనతోనే హింస, వేధింపులకు అడ్డుకట్ట ...బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త :



అంతర్జాతీయ జీరో టాలరెన్స్ డే సందర్భంగా మహిళలు, బాలికల హక్కులు, భద్రత, సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డీహెచ్ఈడబ్ల్యూ), సిర్పూర్ పేపర్ మిల్స్ సీఎస్ఆర్, స్పార్ష్ సోషల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం పరిచయం, బేటీ బచావో - బేటీ పడావో లక్ష్యాలు, సైబర్ నేరాలు, మహిళలు, బాలల అక్రమ రవాణా, పోక్సో చట్టం-2012, లింగ సమానత్వం, సోషల్ మీడియా వినియోగం, బాల్యవివాహాల నిషేధ చట్టం-2006, బాలికల విద్య ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు.మహిళలు, బాలికలపై జరిగే హింస, వేధింపులను అరికట్టేందుకు అమలులో ఉన్న చట్టాలు, ప్రభుత్వ సహాయ సేవలు, టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి అతియా, మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ శారద, రాణి, రాజేశ్వరి, స్పార్ష్ సోషల్ ఫౌండేషన్ ప్రతినిధులు సుశీల, శివ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల పోషణతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త :



ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని బారెగూడ గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ అన్నారు. బారెగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడ అంగన్వాడీ3 కేంద్రంలో నిర్వహించిన తీవ్రమైన, మధ్యస్థాయి పోషకాహార లోపాల గుర్తింపు, నివారణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించడం, నివారించడం, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన వైద్య చికిత్సతో పాటు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దవచ్చని సర్పంచ్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల ఆహారం, ఆరోగ్యం, బరువు, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పునాది వేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యుడు హరీష్, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

పొరపాట్లకు ఏమాత్రం తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇంటర్నెట్ సదుపాయాన్ని ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ప్రతి శిబిరంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి అధికారులు శిబిరాలకు తప్పనిసరిగా హాజరై ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు బీమా భరోసా కల్పించే ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావు, సీపీఓ గంగారెడ్డి, డీపీఓ శ్రీనివాస్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త :




ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని బాధితులకు చట్టపరంగా న్యాయం అందించడమే లక్ష్యంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీకి నేరుగా వివరించారు. ఫిర్యాదులను ఆమె సావధానంగా విని వాటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితుల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించాలని, నిర్ణీత సమయంలో విచారణ పూర్తి చేసి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు పోలీసుశాఖ మరింత చేరువ కావడంతో పాటు వారి సమస్యలకు నేరుగా పరిష్కారం చూపేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసుశాఖ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

ఖేలో ఇండియా కార్యక్రమంపై విస్తృత ప్రచారం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త :

రాష్ట్రంలో డిసెంబర్ 11 నుండి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడల కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, క్రీడల శాఖ ఎం.డి. సోని బాలదేవిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు యువజన క్రీడా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా యువజన సేవల క్రీడా శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెల 11 నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ర్యాలీలు నిర్వహించి పెద్ద ఎత్తున క్రీడాకారులు యువజన సంఘాలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని, మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ఖేలో ఇండియా ప్రాముఖ్యతను తెలియజేసేందుకు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తక్షణమే కాంపౌండ్ వాల్ నిర్మించాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేసిన ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్

విద్యార్థినుల భద్రతకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్

భైంసా, నవంబర్ 16, ప్రభాతవార్త:

ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణానికి రక్షణ గోడ (కాంపౌండ్ వాల్) లేకపోవడం వల్ల విద్యార్థులు, అధ్యాపకులు నిత్యం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆయన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని (డీఈఓ) మర్యాదపూర్వకంగా కలిసి కళాశాలలో నెలకొన్న వివిధ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గడపాలి పరమేష్ మాట్లాడుతూ.. ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ చుట్టూ భద్రతా గోడ లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. కాంపౌండ్ వాల్ లేని కారణంగా సంబంధం లేని వ్యక్తులు, బయటి వ్యక్తులు ఎటువంటి అడ్డు అదుపు లేకుండా యథేచ్ఛగా కళాశాల ఆవరణలోకి వస్తున్నారని వెల్లడించారు. దీనివల్ల ముఖ్యంగా కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినుల భద్రతకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తరగతులు జరుగుతున్న సమయంలో బయటి వ్యక్తుల సంచారం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతిని, కళాశాలలో ప్రశాంతమైన విద్యా వాతావరణం పూర్తిగా కరువవుతోందని పేర్కొన్నారు. కళాశాల సమయం ముగిసిన తర్వాత, రాత్రి వేళల్లో, సెలవు రోజుల్లో కళాశాల ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతుండటం అత్యంత ఆందోళనకరమని ఆయన అన్నారు. ఇక్కడి భద్రతా సమస్యల తీవ్రతను స్వయంగా కళాశాల ప్రిన్సిపల్ కూడా ధృవీకరించారని గుర్తుచేశారు. కాబట్టి విద్యార్థుల భద్రతను, భవిష్యత్తును, కళాశాల రక్షణను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంటనే స్పందించాలని కోరారు. ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తక్షణమే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, పనులు త్వరగా ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ట్రైబల్ జర్నలిస్టులకు స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలి

ఐటీడీఏ పీఓ మంద మకరందుకు వినతిపత్రం అందజేసిన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు

జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్, నవంబర్ 16, ప్రభాతవార్త:



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ట్రైబల్ జర్నలిస్టులకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవి మాణిక్ రావు, చవాన్ రామేశ్వర్‌లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వారు పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ప్రాంతాలలో నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న ట్రైబల్ జర్నలిస్టులు సరైన నివాస వసతిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అర్హులైన ట్రైబల్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి గృహాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల వినతిపత్రాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోశాధికారి జాదవ్ వసంత్ రావు, జర్నలిస్టులు శ్రీకాంత్, పీత నాయక్, గణేష్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

అధికారులకు ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరంద్ ఆదేశం ● వివిధ సమస్యలపై తరలివచ్చిన ఏజెన్సీ ప్రాంత ప్రజలు

ఉట్నూర్, నవంబర్ 16, ప్రభాతవార్త:



ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏజెన్సీలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆయన నేరుగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిరికొండ మండలం లచ్చిపూర్ గ్రామానికి చెందిన కుంరం దీపక్ తమ గ్రామ చెరువు మరమ్మతుల కోసం దరఖాస్తు సమర్పించగా, కాసిపేట్ మండలం మాలకెపల్లి గ్రామానికి చెందిన భారతి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన పీవీటీజీ గ్రామస్థులు తమకు కోళ్ల ఫారం మంజూరు చేయాలని కోరగా, ఖానాపూర్ మండలం కొలాంగూడ గ్రామానికి చెందిన గ్రామస్థులు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల లబ్ధి, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ దరఖాస్తులను సమర్పించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిబంధనల మేరకు అర్హులకు న్యాయం జరిగేలా త్వరితగతిన పరిష్కరించాలని ప్రాజెక్టు అధికారి మంద మకరంద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో నీటి సంరక్షణ పనులను పరిశీలించిన కేంద్ర బృందం

నేషనల్ వాటర్ అవార్డ్స్‌లో భాగంగా 5 గ్రామాల్లో విస్తృత పర్యటన

వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు చర్యలపై సంతృప్తి

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త:



నేషనల్ వాటర్ అవార్డ్స్‌లో భాగంగా నిర్మల్ జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి పనులను పరిశీలించేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు డి. గణేష్ సోమవారం జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాలోని చిట్యాల, ముజ్గి, దిలావర్‌పూర్, మాదేగం, పొన్కల్ గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు తీసుకున్న చర్యలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలమట్టాలను పెంపొందించడం వంటి అంశాల్లో చేపట్టిన పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న జలవనరులను భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, గ్రామస్థాయిలో అమలు చేస్తున్న పనుల వివరాలను సంబంధిత శాఖల అధికారులు కమిషన్ సభ్యులకు వివరించారు. ఈ పర్యటనలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం: మేయర్ ధర్ని మధుకర్

32వ డివిజన్‌లో నూతన గృహ ప్రారంభం.. 31, 32 డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసిన మేయర్

నస్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త



అర్హులైన నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆత్మగౌరవంతో కూడిన సొంతింటిని కల్పించడమే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పం అని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 31, 32వ డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల నూతన గృహ ప్రారంభోత్సవ, నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత 32వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు కొండ సునీత సత్యనారాయణ దంపతులు నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మేయర్ ధర్ని మధుకర్ సుజాత దంపతులు హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. అనంతరం ఇదే డివిజన్‌లో ఇల్లు మంజూరైన పూదరి అనూష సంపత్ దంపతుల నూతన గృహ నిర్మాణానికి మేయర్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అలాగే 31వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డితో కలిసి లబ్ధిదారురాలు ముక్కెర మోనిక నూతన గృహ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ప్రత్యేక చొరవ, నిరంతర కృషి, మార్గదర్శకత్వంతో నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని, నాణ్యతతో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో హౌసింగ్ బోర్డు అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

✳ అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ✳ నిర్మల్ కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజావాణి, ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి ఏర్పాటు

✳ రెండు చేతులతో రాసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించిన చిన్నారికి అభినందన

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త:



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకూడదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావుతో కలిసి ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు సమర్పించారు. మరోవైపు కలెక్టరేట్‌లో పిల్లల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణిని ఏర్పాటు చేయగా, పలువురు చిన్నారులు, తల్లిదండ్రులు తమ వినతులను అందజేశారు. అనంతరం ఐదేళ్ల చిన్న వయసులోనే ఏకకాలంలో రెండు చేతులతో రాసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ఘనత సాధించిన చిన్నారిని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావు ప్రత్యేకంగా అభినందించారు. నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన నాలం శ్రవణ్ కుమార్, గౌతమి దంపతుల కుమార్తె నిద్యాన ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా చిన్నారి ప్రతిభను అదనపు కలెక్టర్ ప్రశంసించి, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారిని భవిష్యత్తులో మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందించేందుకు కృషి: ఎమ్మెల్యే

వానాలపహాడ్‌లోని వంశీరెడ్డి ఫంక్షన్ హాల్‌లో 637 మందికి పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

బతుకుదెరువు కోసం ఆటోలు, వాహనాలు కొనుక్కున్న వారికి పింఛన్లు తిరస్కరించడాన్ని తప్పుపట్టిన వైనం

భైంసా, నవంబర్ 16, ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు అందే విధంగా తన వంతుగా పూర్తి స్థాయిలో సహకరిస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ స్పష్టం చేశారు. సోమవారం భైంసా మండలం వానాలపహాడ్ గ్రామంలోని వంశీరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చేయూత పథకం కింద ఎంపికైన దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు భైంసా మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి 637 మందికి నూతన పింఛన్ మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన పింఛన్ల మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా పింఛన్లు అందక పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా 4,606 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, ఇంకా ఎవరైనా అర్హులైన వారికి పింఛన్ మంజూరు కాకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బతుకుదెరువు కోసం కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు కొనుక్కున్న పేదలకు పింఛన్లు తిరస్కరించడాన్ని ఆయన తప్పుపట్టారు. సాంకేతిక కారణాలు చూపకుండా వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు తనకు ఇచ్చిన అవకాశంతో ముధోల్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని, ప్రజల ఆశీర్వాదంతో రాబోయే మరో రెండు సంవత్సరాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పేద ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఫంక్షన్ హాల్ ప్రాంగణమంతా జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీరజ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధన కోసం పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు

పెంచికల్ పేట్, నవంబర్ 16, ప్రభాతవార్త :



కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు మంగళవారం (నవంబర్ 17) చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా పెంచికల్‌పేట్ మండల పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు కోరారు.ఈ మేరకు సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ కలిసి ఎంపీడీఓ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా ఒకరోజు సామూహిక సెలవు మంజూరు చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు చంద్రయ్య, రాకేష్, విజయ్, రాకేష్, కిష్టయ్య పాల్గొన్నారు.



జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నిర్మల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీహరి రావుకు

టీయూడబ్ల్యూజే ఐజేయూ నేతల వినతి

ఈ నెల 25న జరగనున్న జిల్లా మహాసభలకు ఆహ్వానం అందజేత

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాతవార్త:

ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే ఐజేయూ) నిర్మల్ జిల్లా మహాసభలకు మాజీ జిల్లా డీసీసీ అధ్యక్షులు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీహరి రావును యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని యూనియన్ నాయకులు వివరించారు. అయినప్పటికీ అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో పాటు నివాస సమస్యలను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రత్యేక చొరవ తీసుకుని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 25న జరిగే జిల్లా మహాసభల్లో జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య, జిల్లా కోశాధికారి వీ. ప్రశాంత్, ఉపాధ్యక్షులు గుమ్ముల అశోక్, వేణుగోపాల్, జిల్లా కార్యదర్శులు జల్ద మనోజ్, హనుమాన్లు, ప్రసాద్, రాజన్న, ఉమేష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

భైంసా పట్టణంలో డ్రీమ్ కలెక్షన్ జ్యువెలరీ షాప్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరై షాప్‌ను ప్రారంభించిన

బీఆర్ఎస్ నాయకురాలు డా. పడకంటి రమాదేవి

వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్ష

భైంసా, నవంబర్ 16, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రీమ్ కలెక్షన్ జ్యువెలరీ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు డా. పడకంటి రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షాప్‌ను ప్రారంభించారు. ముధోల్ మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన కళ్యాణ్ కర్ సోను భైంసా పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం పక్కన ఈ జ్యువెలరీ షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా. పడకంటి రమాదేవి షాప్ నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాప్ నిర్వాహకుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుని మృతి

లక్షెట్టిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త



లక్షెట్టిపేట మండలం సూరారం రాష్ట్ర రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సూరారం గ్రామానికి చెందిన చెల్లా చరణ్ అనే 17 సంవత్సరాల యువకుడు మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఆదివారం రాత్రి తన అన్న జస్వంత్, మరో ఇద్దరు మిత్రులతో కలిసి ఆర్ అండ్ ఆర్ కాలనీ వద్దగల హనుమాన్ దేవాలయం నుండి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా లక్షెట్టిపేట వైపు నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోగా చరణ్ చెట్లపొదల్లో ఎగిరిపడి చనిపోయాడు. ఈ ప్రమాదంలో తమతో పాటు ఉన్న తన అన్న జస్వంత్, సిద్ధార్థ్ లకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుని తండ్రి చెల్లె రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం!

మంచిర్యాల నియోజకవర్గంలో 2,509 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిన కొక్కిరాల సురేఖ

మంచిర్యాల, నవంబర్ 16 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో 2,509 మంది చేయూత పింఛన్ లబ్ధిదారులకు నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2,261 మంది, హాజీపూర్ మండలంలోని 248 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే తమ ప్రధాన బాధ్యతగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, సింగిల్ విండో చైర్మన్లు రాజేశ్వరరావు, తోట రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జాలే రాయలింగు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అర్కాల హేమలత, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో శ్రీనిత్య జాతీయ స్థాయికి ఎంపిక

లక్షెట్టిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త:

లక్షెట్టిపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శ్రీనిత్య అండర్ 14 బాలికల విభాగంలో వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో నవంబర్ 13 నుండి 15 వరకు నిర్వహించిన వాలీబాల్ పోటీలలో శ్రీనిత్య అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల విద్యాధికారి జి. శైలజ విద్యార్థినిని అభినందిస్తూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే మరిన్ని విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనిత్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త



ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, సంబంధిత అధికారులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తికి చెందిన మాదర బోయిన కోమలత నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలానికి చెందిన వొడ్నాల శంకర్, కదారి బుచ్చయ్య తాము చేనేత కార్మికులము అని, తమకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. బి.ఎస్.పి. జిల్లా ప్రతినిధి ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తన దరఖాస్తులో మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ భూమిని న్యాయపరంగా స్వాధీనపరచుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన దాసరపు సత్తయ్య తాను గతంలో రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని ఇతరుల పేరిట పట్టా చేశారని, ఈ విషయమై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఎ.ఐ.ఎస్.బి. జిల్లా ప్రతినిధి కనుకుంట్ల సన్నీ గౌడ్ తన దరఖాస్తులో బెల్లంపల్లి పట్టణంలోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యం 8వ తరగతి అనుమతితో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంచిర్యాల పట్టణానికి చెందిన తోట కళావతి తనకు ప్రజాపాలన పథకం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామానికి చెందిన కుశన శంకరయ్య తన తల్లికి విరాసత్ ద్వారా వచ్చిన భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు తెలియకుండా కొందరు దొంగ పట్టా చేయించుకున్నారని, ఈ విషయమై విచారించి, అట్టి పట్టాను రద్దు పరచి, తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన నక్క సత్యం తాను కొనుగోలు చేసిన భూమిలో నిర్మించుకున్న ఇంటికి ఇంటి పన్ను విధించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చెగ్యాం బొందయ్య తనకు గ్రామ శివారులో గల భూమికి సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 58 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సామాన్య ప్రజలకు సేవలు అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ తరఫున జిల్లా న్యాయస్థానం నుండి ఒక అడ్వకేట్ ప్రజావాణిలో అందుబాటులో ఉంటారని, ఎవరైనా నిరుపేదలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారు న్యాయ సహాయం, సలహా కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. న్యాయస్థానాలలో ఏమైనా కేసుల నమోదు, అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి, కోర్టులో సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటారని, ప్రజలు వారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో రోడ్‌పై బైటయించి నిరసన

తెలిపిన భూ నిర్వాసిత రైతులు

జైపూర్, నవంబర్ 16,ప్రభాతవార్త

నేషనల్ హైవే 163 నిర్మాణం కోసం తమ భూములను కోల్పోయిన భూ నిర్వాసిత రైతులకు రావాల్సిన నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కిష్టాపూర్ పెట్రోల్ బంకు వద్ద, రోడ్డు కాంట్రాక్టు క్యాంపు ఎదుట రైతులు బైటయించి పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల క్రితం మొదటి ఆర్బిట్రేషన్ ద్వారా ఎకరానికి 21 లక్షల రూపాయల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు కేవలం 18 లక్షల వరకు మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన 3 లక్షల రూపాయల పరిహారంతో పాటు, పెండింగ్‌లో ఉన్న మొత్తం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూమి కోల్పోయి రెండేళ్లు గడుస్తున్నా పూర్తి పరిహారం అందక, రైతు కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, పిల్లల చదువులు, కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని వారు తెలిపారు.నిరసన విషయం తెలుసుకున్న ఆర్డీవో చరవాణి ద్వారా రైతులతో మాట్లాడి, నష్టపరిహారం త్వరగా అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆర్డీవో గారిని కలిసి తమ సమస్యలను నేరుగా వివరించారు. అయినప్పటికీ అధికారులు ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయకపోతే, రానున్న రోజుల్లో మరింత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, రాస్తారోకోలు చేపడతామని రైతులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సుందిళ్ల మల్లేష్, తుమ్మనపల్లి నర్సింగరావు, గోదారి రాజయ్య, జాడి రాజయ్య, సమ్మయ్య, ఆకుదారి ముండి, బల్ల మొగిలి, ప్యాగ చందు, వడ్లకొండ సతీష్, జాడి తిరుపతి, జాడి లింగయ్య, గోదారి లింగయ్య, గోదారి అంకయ్య, ఇప్పలపల్లి నాగరాజు, గోదారి ముత్తయ్య, జాడి రాకేష్, జాడి సడవలి, జాడి రవి, గోదారి సమ్మయ్య, జాడి గట్టయ్య తదితర భూ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.





అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం

జనవరి 16 వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహన

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 16, ప్రభాతవార్త

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాముల కోసం సోమవారం నుంచి రెండు నెలల పాటు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణానికి చెందిన మెహర్ సాయి ఫర్టిలైజర్స్ యజమాని తాటిపల్లి ఆశిష్ దాతృత్వంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు ఆధ్యాత్మిక సేవాభావంతో భోజన సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు దాత పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు దీక్షా నియమాలను పాటిస్తూ ఇరుముడి, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణంలో కాలం గడుపుతున్న నేపథ్యంలో వారికి అన్నప్రసాదం అందించడం ద్వారా సేవ చేసే అవకాశం లభించిందని దాత పేర్కొన్నారు. ఈ నిత్యాన్నదాన కార్యక్రమం జనవరి 16వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. అయ్యప్ప స్వాములకు భోజన సదుపాయం కల్పించడం ద్వారా స్వామివారి సేవలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు భక్తిభావంతో పాటు సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. అంతకుముందు ఆలయంలో అర్చకుడు నాగేశ్వర్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు బాల ప్రసాద్, కలకుంట్ల శ్రీధర్, స్వాములు కొండా సురేష్, గుండా సతీష్, శివ గణేష్, రుషి, విశాల్, శివ, భక్తులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

హాజీపూర్, నవంబర్ 16,ప్రభాతవార్త:



హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి63పై గుడిపేట పెట్రోల్ పంపు సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును,ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, అవసరమైన హెచ్చరిక బోర్డులు, రేడియం సూచికలు, వేగ నియంత్రణ చర్యలు ఏర్పాటు చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌ను నియంత్రించేందుకు నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చలికాలం కావడంతో రాత్రి వేళల్లో, తెల్లవారుజామున వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పోలీసు నిఘా, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హాజీపూర్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను కమిషనర్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని ఫిర్యాదుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ఉన్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కిరణ్ కుమార్‌ను ఆదేశించారు. ఫిర్యాదుల స్వీకరణ కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, దాని పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు.స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, సంబంధిత సమాచారాన్ని అప్‌లోడ్ చేసే విధానం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దస్త్రాలు, నేర రికార్డులు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలపై ఎస్ఐ కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, వారిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనిఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచుగా సందర్శించి ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకోవడంతో పాటు, స్థానిక సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు రాత్రి వేళల్లో గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ,వారి సమస్యలను సానుకూల దృక్పథంతోపరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు.



మందమర్రి లెదర్ ఫ్యాక్టరీకి మోక్షమెప్పుడూ

ఉపాధి హామీ ఎక్కడ... నిరుద్యోగుల

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు

ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేత

మందమర్రి, నవంబర్ 16, ప్రభాతవార్త:

మందమర్రి పట్టణంలో నిలిచిపోయిన లెదర్ ఫ్యాక్టరీ పనులను తిరిగి ప్రారంభించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తోళ్ల పరిశ్రమ సాధన సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్, మెజిస్ట్రేట్ సతీష్ కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి చేతుల మీదుగా మందమర్రిలో లెదర్ ఫ్యాక్టరీ ప్రారంభించారని తెలిపారు. జిల్లాలో 2003లోనే సుమారు 2 వేల మంది లెదర్ పనుల్లో శిక్షణ పొందారని, పరిశ్రమ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పరిశ్రమ పనులను తిరిగి అదే ప్రభుత్వం పూర్తి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఫ్యాక్టరీకి ప్రహరీ గోడ లేకపోవడంతో ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని, చెట్లు మొలిచి భూములు ఆక్రమణలకు గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రహరీ గోడ నిర్మించి పరిశ్రమను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు సంగి సంతోష్, కొలుగూరి విజయ్ కుమార్, వేల్పుల రాజ్ కుమార్, నేరువట్ల రాజలింగు, దాసరి రాజనర్సు, రౌత్ ప్రేమ్ కుమార్, మేకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో ప్రజావాణిలో 3 అర్జీల స్వీకరణ

లక్షెట్టిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త:



లక్షెట్టిపేట ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 3 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. పలు వార్డుల్లో మౌలిక సౌకర్యాలు, తాగునీరు తదితర సమస్యలపై ప్రజలు మూడు అర్జీలను అధికారులకు అందజేశారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

మండలాభివృద్ధి కార్యాలయంలో వి.బి.జి.ఆర్.ఏ.ఎం.జి పై అవగాహన సదస్సు

జైపూర్, నవంబర్ 16,ప్రభాతవార్త:

డి.ఎల్.పి.ఓ. ధర్మారాణి సోమవారం జైపూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, వి.బి.జి. ఆర్.ఏ.ఎం.జి సిబ్బందికి ఎం.పి.డి.ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీలలో ప్రతి ఇంటికి సోక్ పిట్స్ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాలి. ప్రతీ ఇంటికి పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి. ఫారం పాండ్స్ నిర్మాణము, బోర్‌వెల్ రిచార్జీ, రూఫ్ టాప్ హార్వెస్టింగ్, డ్రైన్ ఎండ్ సోక్ పిట్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్ పెండింగ్ లేకుండా అన్ని పూర్తి చేయాలి. వి.ఓ బిల్డింగ్స్ సి.ఎస్.సి నిర్మాణంలు పూర్తి చేయాలి. ప్రతిరోజు లేబరు 60 మందికి తగ్గకుండా చూసుకోవాలి. గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూలు వేగవంతం చేసి ఈ నెల ఆఖరి వరకు 100 శాతం పూర్తి చేయాలి.ట్రేడ్ లైసెన్స్ లు వెంటనే రెన్యువల్ చేయించాలని అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశములో ఎంపీడీవో శ్రీపతి బాపు రావు, ఆర్.డబ్ల్యూ.ఎస్. ఏ.ఈ రాజమల్లయ్య, ఈ.సి రాజమొగిలి, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు హాజరయ్యారు.





సర్వే నంబర్ 87లోని ప్రభుత్వ భూమిని కాపాడి అంబేద్కర్ స్టడీ సెంటర్ నిర్మించాలి

జిల్లా కలెక్టర్‌కు బీఎస్పీ వినతి

నస్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త

మంచిర్యాల పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 87లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కాదాసి రవీందర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్‌కు లిచితపూర్వక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పట్టణంలోని ఏ1 హోటల్ పక్కన ఉన్న సర్వే నంబర్ 87లోని ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదాలు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, తీర్పు రాకముందే కొందరు వ్యక్తులు ఆ భూమిని అన్యాక్రాంతం చేసేందుకు బ్లూ షీట్లు వేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని, అక్రమ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కోట్ల రూపాయల విలువైన ఈ ప్రభుత్వ స్థలాన్ని స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడి, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఈ స్థలంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వీలుగా గ్రంథాలయంతో కూడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలోని చిరు వ్యాపారులు, నిరుపేద కుటుంబాల జీవనోపాధి కోసం చిన్న దుకాణాల సముదాయాన్ని నిర్మించి కేటాయించడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధితో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఈ అంశంపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఈసీ మెంబర్ ఎండీ మాతిన్ ఖాన్, మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెట్టం చంద్రశేఖర్, అధ్యక్షుడు బండారి రాజ్ కుమార్, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుర్గం గంగారాం, అధ్యక్షుడు గాజుల శంకర్, మందమర్రి మండల అధ్యక్షుడు ఎండీ రహీం బాబా, నాయకులు చింతల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, శిశు మందిర్ భూమిపూజలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాల, నవంబర్ 16, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల పునర్నిర్మాణ పనులకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో కూడా కొక్కిరాల సురేఖ పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అర్కాల హేమలత, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





భూముల సర్వేలో వేగం పెంచాలి

ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లాల వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని పాలనాధికారి చాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి 6 మండలాల సర్వేయర్లకు సర్వే కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వేలో ఓవర్లు, ఇతర పరికరాల సహాయంతో భూముల సర్వే నిర్వహించడంతో సర్వే ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, సాంకేతికత వినియోగంతో ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. భవిష్యత్తులో భూ వివాదాలు లేకుండా రికార్డులను పకడ్బందీగా నిర్వహించవచ్చని, రెవెన్యూ సిబ్బంది పరికరాలు ఉపయోగించే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. వినయ్ కుమార్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.



ముగిసిన క్రికెట్ పోటీలు విజేతలకు బహుమతుల ప్రదానం

తాండూర్, నవంబర్ 16 ప్రభాతవార్త :

తాండూర్ మండలం మాదారం పోలీస్ స్టేషన్ ఎదురుగా గల మైదానంలో నవంబర్ 3 నుంచి నిర్వహించిన ఐబీ ప్రీమియర్ లీగ్2 క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ పోరులో కార్ల్స్ బర్గ్, సార్ల రమేష్ జట్లు తలపడగా కార్ల్స్ బర్గ్ జట్టు గెలిచి లీగ్ విజేతగా నిలిచింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై విన్నర్, రన్నర్ జట్లకు షీల్డులు, నగదు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ క్రీడలు యువతల్లో స్నేహభావం, శారీర దారుఢ్యాన్ని పొందిస్తాయన్నారు.యువత క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, మాజీ జడ్పిటిసి మంగపతి సురేష్ బాబు, మండల బిఆర్ఎస్ నాయకులు గట్టు సంతోష్ కుమార్, ఎలుక రామచందర్, దత్తాత్రేయ రావు, మసాడి శ్రీరాములు, బోనగిరి చంద్రశేఖర్, దుగుట శ్రీనివాస్,బోడ సతీష్, జాడి పోచం, క్రిస్టఫర్, పుప్పలా తిరుపతి, ప్రదీప్ రావు, బాబు ఖాన్, చింటూ, ఈక్బాల్, రాకేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయకుడిపై అనుచిత పోస్టు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త:

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ చిత్రాన్ని మార్ఫింగ్ చేసి, చెప్పుల దండ వేసినట్లుగా ఇన్‌స్టాగ్రామ్‌లో అవమానకర పోస్టు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తుడుందెబ్బ జిల్లా నాయకులు డీఎస్పీ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ నాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, సమాజంలో అలజడి సృష్టించే విధంగా పోస్టులు పెట్టడం హేయమైన చర్య అని ఖండించారు. సదరు వ్యక్తిని గుర్తించి సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతి, కార్యదర్శి సిడాం నాగోరావు, ఉపాధ్యక్షుడు మడపచి భీంరావు, వాంకిడి మండల అధ్యక్షుడు పంద్రం సురేష్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు కోడప జగన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలి

విధుల్లో నిరక్ష్యానికి తావులేకుండా బాధ్యతగా పనిచేయాలి... కెరమెరి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

... గుడుంబా,పేకాట, బెట్టింగ్,గంజాయి విక్రయం,అక్రమ రవాణాపై నిరంతర నిఘా, తనిఖీలు.. చేయాలని అధికారులకు సిబ్బంది కి జిల్లా ఎస్పీ సూచన

కెరమెరి, నవంబర్ 16, ప్రభాతవార్త:



ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని విధుల్లో ఎలాంటి నిరక్ష్యం వహించరాదని బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్, అన్నారు సోమవారం కెరమెరి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ,వారి సమస్యలను ఓపికగా విని, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని,కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ,అసాంఘిక కార్యకలాపాలు,గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.గ్రామస్థాయిలో పోలీసులపై ప్రజలకు నమ్మకం,విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని,విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, క్రమశిక్షణ,సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు.ఈ తనిఖీలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం

వాంకిడి, నవంబర్ 16, ప్రభాతవార్త :

వాంకిడి మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సోమవారం జాతీయ పత్రిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామగిరి రాంబాబు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు చేతన్ శర్మ జయంత్ కుమార్, రవీంద్రప్రసాద్, రహీద్ పాషా, దిలీప్, రాకేష్, పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో అధికారుల బృందం పర్యటన

తాండూర్, నవంబర్ 16, ప్రభాతవార్త :

మండలంలోని నీలాయిపల్లి,రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని హ్యాబిటేషన్లలో సోమవారం అధికారుల పర్యటించింది. రాబోయే వేసవి, ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం చేపట్టిన ముందస్తు సన్నాహక ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, మిషన్ భగీరథ అంతర్గత పైపులైన్ల పనితీరు, నీటి సరఫరా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులుగా ఉపయోగపడే చేతిపంపులను తనిఖీ చేశారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఈఈ (ఇంట్రా) మనోహర్, ఏఈఈ (గ్రిడ్) ఖదీర్, సర్పంచులు పోలవేణి తిరుపతి, మామిడాల లలిత, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రినేత్ర శివాలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు

శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించిన డా. కొత్తపల్లి అనిత, డా. కొత్తపల్లి శ్రీనివాస్



కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :

కార్తీక మాసం ప్రథమ సోమవారం సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని ఆదర్శనగర్ శ్రీ త్రినేత్ర శివాలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత, డా. కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. కార్తిక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉందని, భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

సారంగాపూర్ మండలంలో నూతన పింఛన్ల పంపిణీ

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాల అందజేత

సారంగాపూర్, నవంబర్ 15, ప్రభాతవార్త:



సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పింఛన్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆదివారం రోజున స్థానిక లబ్ధిదారులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా నూతన పింఛన్ మంజూరు పత్రాలను ఘనంగా అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గడిచిన అనేక సంవత్సరాలుగా పింఛన్లు రాక తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఆదుకుని నూతన పింఛన్లు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌట్ల బి గ్రామానికి చెందిన సర్పంచ్ అజయ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుర్వం అనిత నియామకం..

మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం.. పార్టీ బలోపేతమే లక్ష్యం

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త :



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామానికి చెందిన సుర్వం అనిత జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవెల్లి సువర్ణ ఆమె నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా సుర్వం అనిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తూ జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అలకా లాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రవెల్లి సువర్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రాజకీయంగా తనకు వెన్నుదన్నుగా నిలుస్తూ, ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి. అదితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.